AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## గడుగును పరామర్శించిన బాజిరెడ్డి గోవర్ధన్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ ఇల్లు కొన్ని రోజుల క్రితం షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. సోమవారం నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆయనను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


22-6-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2




## ప్రజావాణికి 160 ఫిర్యాదులు

**అక్షరటుడే, ఇందూరు:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 160 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, భుజంగరావు, ట్రెయినీ కలెక్టర్ సురేష్, డీఆర్వో గీత, జిల్లా పరిషత్ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో సాయన్న, బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బోధన్ బల్దియాలో కలకలం.. టెంట్ వేసుకుని ఎంఐఎం కౌన్సిలర్ల ధర్నా..



**అక్షరటుటే, బోధన్:** పట్టణంలో ఎంఐఎం కౌన్సిలర్లు ఆందోళన బాట పట్టారు. బల్దియా కార్యాలయం ఎదుట సోమవారం టెంట్ వేసుకొని ధర్నా చేశారు. మున్సిపల్ పాలకవర్గం ఏర్పడి మూడు నెలలు అవుతున్నప్పటికీ ఇప్పటివరకు ఒక్కసారి కూడా కౌన్సిల్ మీటింగ్ నిర్వహించలేదని ఎంఐఎం కార్పొరేటర్లు ఆరోపించారు. బల్దియా వైస్ ఛైర్మన్ ఇలియాస్ మాట్లాడుతూ పట్టణంలో శానిటైజేషన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. పాలకవర్గం సమావేశం నిర్వహించి అధికారులకు సూచనలు సలహాలు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు సమావేశం నిర్వహించకపోవడంతో పట్టణంలో పాలన గాడి తప్పిందన్నారు. కాలనీల్లో ఎలాంటి సమస్యలు పరిష్కారం కావట్లేదని.. దీంతో ప్రజల మధ్య తిరగలేకపోతున్నామని వైస్ ఛైర్మన్ అన్నారు. అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోందని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పట్టణ శివారులోని పసుపు వాగులో దర్జాగా బల్దియా బీసీబీలతో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయని ఇది ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.




విశ్వవిద్యాలయం అంటే విజ్ఞానానికి నిలయంగా, సమాజానికి మార్గదర్శకంగా నిలవాలి. తరగతి గదులు విద్యార్థులతో నిత్యం కళకళలాడాలి. ఆచార్యులు పరిశోధనలు, పేటెంట్ల కోసం పోటీ పడాలి. కానీ తెలంగాణ విశ్వవిద్యాలయంలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా మారుతున్నాయనే విమర్శలు ఏళ్లుగా వినిపిస్తున్నాయి. కొందరు ఆచార్యులు విద్యా, పరిశోధనల కంటే రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. రెండు వర్గాలుగా విడిపోయి పరస్పరం ఆధిపత్య పోరాటాలు సాగిస్తూ, విద్యార్థి సంఘాలను తమ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారు.

- అక్షరటుడే, తెయూ క్యాంపస్

# తెయూలో వర్గపోరు

- రెండుగా విడిపోయిన ఆచార్యులు
- విద్యార్థి సంఘాలను వాడుకుంటున్న వైనం
- కుంటుపడుతున్న బోధన
- పట్టించుకోని అధికారులు

తెయూలో ప్రొఫెసర్లు ఒకే విద్యా లక్ష్యంతో కాకుండా వర్గాలుగా ఏర్పడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. కీలక కమిటీలు, పరిపాలనా నిర్ణయాలు, నియామకాలు, పరిశోధన అవకాశాల్లో కూడా ఈ వర్గ ప్రభావం కనిపిస్తోందని అధ్యాపక వర్గాల నుంచే వినిపిస్తోన్న మాట. ఒక వర్గం తీసుకున్న నిర్ణయాన్ని మరో వర్గం వ్యతిరేకించడం, పరస్పర ఆరోపణలు చేసుకోవడంతో విద్యా వాతావరణం దెబ్బతింటోంది.

### పావులుగా విద్యార్థి సంఘాలు

విద్యార్థుల సమస్యలపై పోరాడాల్సిన సంఘాలు కూడా కొన్నిచోట్ల ఆచార్యుల వర్గ రాజకీయాలకు బలవుతున్నాయనే విమర్శలు లేకపోలేవు. కొన్ని సంఘాలకు పరోక్షంగా ఆర్థిక, ఇతర మద్దతు అందించి ప్రత్యర్థి వర్గాలపై ఉద్యమాలకు ఉసిగొల్పుతున్నారనే ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. నచ్చని అధికారులపై నిరసనలు చేయించడం, మీడియా సమావేశాలు పెట్టించడం, సోషల్ మీడియాలో ప్రచారం చేయించడం, ఫిర్యాదులు, వినతిపత్రాలు ఇప్పించడం లాంటి చర్యల్లో కొంతమంది ఆచార్యులు ఆరి తేరారు. ఇంకో అడుగు ముందుకేసి కర పత్రాలు ముద్రిస్తున్నారు.

### పరిశోధనల కంటే..

విద్యార్థుల అకడమిక్ అభివృద్ధి, పరిశోధనలపై దృష్టి పెట్టాల్సిన కొందరు ఆచార్యులు వర్గ పోరాటాల్లో సమయం వెచ్చిస్తున్నారు. యూనివర్సిటీకి సమయానికి వచ్చి బయో మెట్రిక్ వేసి తరగతి గదుల్లో పాఠాలు బోధించకుండా క్యాంపస్ ప్రాంగణంలో వర్గ రాజకీయాలకు అధిక సమయం వెచ్చిస్తున్నారు. ఫలితంగా, పరిశోధన నాణ్యత తగ్గడం, పీహెచ్‌డీ విద్యార్థులకు ఇబ్బందులు, ప్రాజెక్టుల ఆలస్యం, అకడమిక్ వాతావరణం దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.

### పదవుల కోసం పోటీ

అడ్మినిస్ట్రేషన్ పదవులు, డీన్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్, వివిధ కమిటీల ఛైర్మన్ వంటి పదవుల విషయంలో వర్గ రాజకీయాలు ప్రభావం చూపుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అర్హత కంటే అనుబంధాలకు ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు సైతం వర్గాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే అపవాదు నెలకొంది. యూనివర్సిటీలో వర్గ రాజకీయాలతో చివరకు విద్యార్థులు నష్టపోతున్నారు.

## నాలుగు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ మండలాధ్యక్షుల నియామకం..



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్, బోధన్ నియోజకవర్గాల్లోని మండలాలకు కాంగ్రెస్ అధ్యక్షులను అధిష్టానం నియమించింది. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో 25 మండలాల కాంగ్రెస్ అధ్యక్షులను, ముగ్గురు టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులను నియమించినట్లు నగేష్ రెడ్డి పేర్కొన్నారు. అధ్యక్షులు నాగరాజు రెడ్డి (ఆర్మూర్), దయాకర్ రావ్(మాక్లూర్), ప్రమోద్ (ఆలూర్), దూడ వెంకటేష్(నందిపేట్), బాబు రావ్(డొంకేశ్వర్), సాయి బాబా గౌడ్ (ఆర్మూర్ టౌన్). మంగూరప్ రవి (మోపాల్), కిషన్ నేత (ఇందల్వాయి), మూత జనార్దన్(నిజామాబాద్ రూరల్), రాథోడ్ అంబర్ సింగ్ (డిచ్‌పల్లి), గాదె నరేష్(ధర్పల్లి), సంజీవ్ అలియాస్ సురేష్ (జక్రాన్‌పల్లి), రొండ్ల గోవర్ధన్(సిరికొండ). రవి (సాలూర), నాగేశ్వర్ రావ్(బోధన్ మండల్), శ్రీనివాస్ గౌడ్( నవీపేట్), శ్రీనివాస్(ఎడపల్లి), దామోదర్(బోధన్ టౌన్), మొబిన్(రెంజల్). సాట్ల ప్రవీణ్(బాల్కొండ), లక్ష్మణ్ (భీమ్‌గల్), భాస్కర్(కమ్మర్‌పల్లి), శివ కుమార్(ఎర్గట్ల), ఆనంద్(మోర్తాడ్), శ్రీకాంత్ రెడ్డి (ముప్కాల్), అనిల్ (వేల్పూర్), సాయిరెడ్డి(మెండోరా),పర్స అనంత్ రావ్(భీమ్‌గల్ టౌన్) ఎన్నికయ్యారు.

## 23న ఆర్టీసీ కార్గోలో వస్తువుల వేలం



**అక్షరటుడే, నిఆజమాబాద్ అర్బన్:** నగరంలోని బస్టాండ్ ఆవరణలో ఉన్న ఆర్టీసీ కార్గో సెంటర్‌లో క్లెయిమ్ చేయని వస్తువుల వేలం నిర్వహించనున్నారు. బస్టాండ్ ఆవరణలోని కార్గో ఆఫీస్‌లో మధ్యాహ్నం 3 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. నిర్ణీత గడువులోగా వినియోగదారులు తీసుకెళ్లని పార్సిల్ వస్తువులను ఈ వేలంలో విక్రయిస్తారు. ఆసక్తి గలవారు అధిక సంఖ్యలో పాల్గొనాలని అధికారులు కోరారు. టీజీఎస్ఆర్టీసీ కార్గో పార్శిల్ సేవలపై 30శాతం ప్రత్యేక తగ్గింపు కూడా అందుబాటులో ఉంది.




## ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

**అక్షరటుడే, ఇందూరు:** ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజు దోపిడీని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 23,000 ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే చర్యలను నిలిపివేయాలని వారు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కర్క గణేష్, జిల్లా ఉపాధ్యక్షుడు అషూర్ మాట్లాడుతూ, విద్యను హక్కుగా కాకుండా వ్యాపార వస్తువుగా మార్చే విధానాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు వైష్ణవి, నసీర్, నితిన్, జిల్లా సహాయ కార్యదర్శి ఆల్గోట్ సృజన్, జిల్లా నాయకులు హేమాంజలి, మహేందర్, మణితేజ, శ్రీశాంత్, అరవింద్, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.


## హౌజింగ్ బోర్డు హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి తొలగిన అడ్డంకులు



**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో ఉన్న హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి అడ్డంకులు తొలిగాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ ఆమోదంతో ప్రభుత్వం ఎన్వోసీ ఇచ్చిందని తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి పట్టణంలో హౌసింగ్‌బోర్డు హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానం చేయడం సంతోషకరమన్నారు. శ్మశాన వాటిక అభివృద్ధికి ఎస్ఆర్ ఫౌండేషన్ ముందుకు వచ్చిందని వెల్లడించారు. ప్రస్తుతం శ్మశాన వాటికకు సంబంధించి ఎన్ని ఎకరాల భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉందో తెలుసుకునేందుకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్వే చేపడతారని తెలిపారు. ఇందిరానగర్ కాలనీలో ఉన్న హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి విషయంలో మరో రెండు స్వచ్ఛంద సంస్థలు, ఇద్దరు వ్యాపారులను సంప్రదించామని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. హౌసింగ్ బోర్డు వద్ద కాలువలపై అక్రమంగా కల్వర్టులు నిర్మిస్తున్న వారికి మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేయడాన్ని ఆయన అభినందించారు. నియోజకవర్గంలో ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ ఒత్తిళ్లతో పనిచేయడానికి ఇబ్బంది పడుతున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. కొద్దిరోజులుగా కామారెడ్డిలో జరుగుతున్న పరిణామాలపై పార్టీ క్రమశిక్షణా కమిటీ స్పష్టమైన సూచనలు ఇచ్చిందని తెలిపారు. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు అందరూ కలిసి పనిచేయాలని సూచించిందన్నారు. ఎవరినైనా కలిసి పని చేయాలని మాత్రమే పార్టీ సూచిస్తుందని, ఒకరి కింద పని చేయాలని చెప్పదని ఒక ప్రశ్నకు బదులిచ్చారు. పార్టీ నిర్ణయం మేరకే తాము పనిచేస్తామని తెలిపారు. కౌన్సిలర్ మహేష్, డీసీసీ ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, శ్రీనివాస్, శంకర్ రావు, జమీల్, సలీం, రమేష్, రంగ రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి పథంలో ఎల్లారెడ్డి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎల్లారెడ్డి నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. మండలంలోని గొల్లపల్లి గ్రామంలో సుమారు రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ మహిళల అభ్యర్థన మేరకు రూ.10 లక్షల నిధులతో మహిళా సంఘ భవనాన్ని కేటాయించామన్నారు. అలాగే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సైతం నిధులు ఇచ్చామన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి ఎక్కడ కూడా రాజీపడబోమన్నారు. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత గొల్లపల్లి గ్రామానికి సీసీ రోడ్లు, సీఎంఆర్ఎఫ్ చెక్కులు, మహిళా సంఘం భవనం, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు, గృహ జ్యోతి వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ పాటిల్, రామారెడ్డి మండల అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్, పాలకవర్గం, మండల సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



## పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి



**అక్షరటుడే,నిజామాబాద్‌సిటీ:** నగరంలో ఎక్కడ కూడా పారిశుధ్య సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. వర్షాకాలంను దృష్టిలో పెట్టుకుని నివాస ప్రాంతాలు, ప్రధాన రహదారులలో మురుగు జలాలు, వర్షపు నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇతర అధికారులతో కలిసి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సోమవారం ఉదయం నగరంలోని ఆయా ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. బోధన్ రోడ్, ఖిల్లా రోడ్డు, ఫ్రూట్ మార్కెట్, దేవీ థియేటర్ చౌరస్తా, ఖలీల్ వాడి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ బిల్డింగ్ తదితర ప్రాంతాలను సందర్శించారు. స్థానికంగా నెలకొని ఉన్న పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు భవన సముదాయాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధాన మార్గాలలోని డ్రైనేజీలను పరిశీలించి, చెత్త చెదారం పేరుకుపోకుండా వెంటవెంటనే శుభ్రం చేయించాలని, వర్షపు జలాలు నిలువ ఉండకుండా సాఫీగా ముందుకు ప్రవహించేలా డ్రైనేజీలపై గ్రిల్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. వానల వల్ల రోడ్లపై ఏర్పడే గుంతలను వర్షాకాలం అనతరం తక్షణమే పూడ్చివేయించాలని, అవసరమైన చోట డ్రైనేజీల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా ఛైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, కార్పొరేటర్ షకీల్, స్థానిక ప్రజాప్రతిని1ధులు, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

# శిథిలావస్థలో సర్కారు స్కూళ్లు..

గాంధారి మండలంలోని పలు పాఠశాలలు శిథిలావస్థకు చేరాయి. విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే బడులను బాగు చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించారనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ ఈ శిథిలబడుల్లో విద్యనభ్యసిస్తున్నారు.

- అక్షరటుడే, గాంధారి



■ భయం భయంగా విద్యార్థులు ■ గాంధారి మండలంలో దుస్థితి ■ స్పందించని అధికారులు..

మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఇక్కడ దాదాపు 500 నుండి 600 మంది విద్యార్థులు చదువు కుంటున్నారు. పాఠశాల ప్రారంభమైనా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో తరగతుల నిర్వహణ కష్టంగా మారింది.

### గోడల మధ్య చెట్లు..

పాఠశాల గోడల మధ్య చెట్ల వేర్లు లోపలికి చొచ్చుకువచ్చినా, ఆర్అండ్‌బీ అధికారులు మాత్రం గోడలు దృఢంగా ఉన్నాయని, ప్లాస్టరింగ్ చేస్తే సరిపోతుందని నివేదిక ఇవ్వడంపై విద్యాశాఖ అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పెచ్చులు పడకుండా చేసిన పీఓపీ పనులు కూడా వృథా అయ్యాయని వారంటున్నారు.

### జీతం ఇక్కడే.. డ్యూటీ ఇంకెక్కడో!

పాఠశాలకు పీఈటీ లేకపోవడంతో విద్యార్థుల క్రమశిక్షణ, క్రీడా నైపుణ్యం దెబ్బతింటోంది. ఇక్కడ పోస్టింగ్ ఉన్న పీఈటీ ప్రస్తుతం డిప్యూటేషన్‌పై వేరే చోట విధులు నిర్వహిస్తూ, జీతం మాత్రం ఇక్కడే పొందుతున్నారు. ఆయన స్థానంలో మరొకరిని నియమించకపోవడంతో విద్యార్థులు క్రీడల్లో నష్టపోతున్నారు.

### మండలంలోని ఇతర పాఠశాలలు..

మండలంలోని రాంపూర్ గడ్డ ప్రైమరీ స్కూల్ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి కూల్చివేతకు సిద్ధంగా ఉంది. అలాగే చిన్న పోతంగల్ ప్రైమరీ స్కూల్‌లో



ఒక తరగతి గది పూర్తిగా శిథిలావస్థకు చేరింది. పెట్ సంఘం హైస్కూల్‌లోఒక తరగతి గది ప్రమాదకరంగా మారడంతో వాడకూడదని ఆర్అండ్‌బీ అధికారులు సూచించారు. ఈ విషయమై ఎంఈవో శ్రీహరి మాట్లాడుతూ.. శిథిలావస్థకు చేరిన పాఠశాలల కూల్చివేత, నిర్మాణ అంశాలు ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో ఉన్నాయన్నారు.

### ఆర్అండ్‌బీ నివేదికపై ఆగ్రహం

మండలంలోని స్కూళ్లలో కొన్ని తరగతి గదులు కనీసం స్టోర్ రూమ్‌గా కూడా వాడటానికి వీల్లేనంతగా పెచ్చులూడి కూలిపోయే స్థితిలో ఉన్నాయి. అయితే మరోవైపు కొత్తగా నిర్మించిన భవనాలకు ప్లాస్టరింగ్ పూర్తి కాకపోవడంతో అలాగే అరకొర వసతులతో తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే ఆర్అండ్‌బీ అధికారుల నివేదిక మాత్రం విచిత్రంగా ఉంది. పెచ్చులూడిపోయిన గదులకు ప్లాస్టిరంగ్ వేస్తే సరిపోతుందని పేర్కొనడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## ముప్కాల్ గ్రామసభను బహిష్కరించిన ప్రజలు

**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రామసభను గ్రామస్తులు బహిష్కరించారు. వారు మాట్లాడుతూ.. 15వ ఆర్థికసాయం నిధుల విడుదలకు సంబంధించిన అసలు పత్రాలు గ్రామసభ ముందుంచాలని కోరితే సర్పంచ్ కొమ్ముల సాయమ్మ పత్రాలను పక్క గ్రామంలో చూపిస్తారా అంటూ మాట్లాడారన్నారు. అదేవిధంగా జనరల్ ఫండ్, 15వ ఆర్థిక నిధులపై గ్రామస్తులు వివరణ కోరగా అందుకు ఉప సర్పంచ్ బ్రహ్మదండి చిన్నయ్య, సెక్రటరీ దివ్య, వార్డు సభ్యులు గ్రామస్తులకు సమాధానం ఇవ్వకుండా 'మాకు ఏం చెప్పాలో తెలియడం లేదు' అంటూ నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చారన్నారు. దీనికి నిరసనగా సభను బహిష్కరించామని.. అనంతరం సర్పంచ్ కొమ్ముల సాయవ్వ, సెక్రటరీ దివ్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జీపీలో పనిచేసే పారిశుధ్య కార్మికుల జీతాలను కూడా ఉపసంహరించుకుని సొంతంగా వారి అవసరాలకు వాడుకుంటున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు.



## 23న గండిపేట్‌లో కాసీం దూల సవారి

**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని గండిపేట్ గ్రామంలో నిర్వహించే కాసీం దూల సవారీ నేటి నుంచి మొదలవుతాయని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి నిజామాబాద్ నుండి కాకుండా మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుండి కూడా అనేక మంది భక్తులు కాసీందూల జాతరకు విచ్చేసి మొక్కులు చెల్లిస్తారని అన్నారు. అంతేకాకుండా పెద్ద మసీదు, చిన్న మసీదు రెండు మసీదుల పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్తారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామస్తులు కోరారు.



## మెండోరాలో డ్రైనేజీ పనుల పరిశీలన

**అక్షరటుడే, మెండోరా:** మెండోరా మండల కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ నిర్మాణ పనులను సర్పంచ్ బుట్టడి ప్రమోద్ కుమార్, ఉప సర్పంచ్ మిట్టపల్లి రాజేశ్వర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని సమీక్షించిన వారు.. నిర్మాణ పనులను వేగవంతం చేసి తక్షణమే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపర్చడంలో డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. డ్రైనేజీ పనులు పూర్తయితే వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తగ్గి ప్రజలకు మరింత సౌకర్యం కలుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శ్రీనివాస్, రాజు, శంకర్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మెండోరా రామాలయంలో ప్రత్యేక పూజలు

**అక్షరటుడే, భీమ్‌గల్:** మెండోరా గ్రామంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పీఎం మోదీ దేశ ప్రధానిగా 12ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం బీజేపీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్టీ భీమ్‌గల్ మండల అధ్యక్షుడు అరె రవీందర్ పాల్గొని మాట్లాడారు. రామాయణంలో విన్న రామరాజ్య పరిపాలనను నేడు మోదీ నాయకత్వంలో ప్రజలు కళ్లారా చూస్తున్నారని కొనియాడారు. దేశ సంక్షేమం, అభివృద్ధి కోసం శ్రమిస్తున్న ప్రధాని నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. బీజేపీ జిల్లా నాయకులు నాగార్జున రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు ఎర్రోళ్ల గంగాధర్, కిసాన్ మోర్చా మండల ఉపాధ్యక్షుడు తక్కూరి అంజయ్య, శక్తి కేంద్ర ఇంచార్జ్ గాడి వేణు, సీనియర్ నాయకులు పార్వతి శ్రీనివాస్, ఏశాల గంగాధర్ పాల్గొన్నారు.




## విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ పిప్రి రోడ్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఫస్టియర్ విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను కళాశాల ప్రిన్సిపాల్ సుభాష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు అన్ని వసతులు సౌకర్యాలు కల్పించామన్నారు. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రశేఖర్, నరేష్, లక్ష్మణ్, శ్రీనివాస్, రవి, చంద్రమోహన్, రామకృష్ణ, కృష్ణమోహన్, రెహమాన్, నిఖిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

**అక్షరటుడే, మెండోరా:** రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మెండోరా మండలంలో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై సుహాసిని తెలిపిన వివరాల ప్రకారం.. బస్సాపూర్ గ్రామ శివారులోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందినట్లు సమాచారం రాగా.. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో సదరు వ్యక్తి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి వయస్సు 50 నుంచి 60ఏళ్ల వరకు ఉంటుందని.. సమాచారం కోసం 8712659763, 8712659864లలో సంప్రదించాలని ఎస్సై సుహాసిని కోరారు.

## కొనసాగుతున్న పోచంపాడ్ జల విద్యుత్ కేంద్రం ఉద్యోగుల నిరసన

**అక్షరటుడే, మెండోరా:** యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని కోల్, యాష్ ప్లాంట్ల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు టెండర్లు పిలవడాన్ని నిరసిస్తూ పోచంపాడ్ జల విద్యుత్ కేంద్రంలో ఉద్యోగుల ఆందోళన మూడో రోజుకు చేరుకుంది. టీజీపీఈజేఏసీ నాయకులు సతీష్, ఎండీ రఫీక్, దేవరాజ్, ప్రవీణ్, చంద్రశేఖర్, మంజుల, జి. గంగాధర్, శ్రీకాంత్, తక్కన్న, శివరామ్ తదితరుల నాయకత్వంలో ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే నిర్ణయాన్ని యాజమాన్యం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ వల్ల ఉద్యోగుల భద్రత, సంస్థల భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాలని, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడాలని కోరుతూ తమ నిరసన కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు, టీజీపీఈజేఏసీ నాయకులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## కళాశాల విద్యార్థులకు 'అన్న–అక్క మెంటర్‌షిప్'పై శిక్షణ

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్న-అక్క మెంటర్‌షిప్ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా థర్డ్ ఇయర్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. డిగ్రీ విద్యార్థులతో పాఠశాల విద్యార్థులకు కృత్రిమ మేధ, డిజిటల్ బోధన కోసం చేపట్టిన ఈ కార్యక్రమం అమలు కోసం స్థానిక డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థులను మెంటార్లుగా ఎంపిక చేశారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాల పెంపు, వృత్తి నైపుణ్యాల అభివృద్ధి, ఉన్నత విద్యా అవకాశాలపై అవగాహన కల్పించారు.

### విద్యార్థుల భవిష్యత్ కోసం..

ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అన్నా-అక్క మెంటర్‌షిప్ కార్యక్రమం విద్యార్థుల భవిష్యత్ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రతి తృతీయ సంవత్సరం విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమం ఈనెల 22వ తేదీ నుంచి 30 వరకు





కొనసాగుతుందని తెలిపారు.ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు తమకు కేటాయించిన పాఠశాలలకు వెళ్లి జూలై 1 నుంచి 15 వరకు బోధిస్తారు. అందుకు విద్యార్థులకు రెండు క్రెడిట్లు, సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఈ విద్యార్థులు డిజిటల్ లెర్నింగ్ గురించి నేర్చుకుని, పాఠశాల విద్యార్థులకు వివరిస్తారని చెప్పారు.


## బోధన్‌లో విద్యుత్ షాక్‌తో దంపతుల మృతి

**అక్షరటుడే, బోధన్:** బోధన్ మండలంలో విషాదం చోటు చేసుకుంది. దుస్తులు ఆరేసేందుకు వెళ్లి విద్యుత్‌తీగలు తగిలి మహిళ మృతిచెందగా.. ఆమెను కాపాడేందుకు వెళ్లిన భర్త సైతం షాక్‌కు గురై దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన బోధన్ మండలంలోని ఊట్‌పల్లిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని ఊట్‌పల్లిలో సంజీవ్, జ్యోతి దంపతులు నివాసముంటున్నారు. వారికి ముగ్గురు ఆడపిల్లలు. అయితే ఆదివారం జ్యోతి దుస్తులు ఆరేసేందుకు దండంను ముట్టకుంది. అయితే అప్పటికే ఆ దండానికి విద్యుత్ సరఫరా ఉండడంతో ఆమె విద్యుత్ షాక్‌కు గురైంది. ఆమె అరుపులు విన్న భర్త సంజీవ్ ఆమెను కాపాడేందుకు వెళ్లి ఆయన సైతం విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఇద్దరు షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న కుటుంబీకులు సంఘటనాస్థలానికి చేరుకుని బోరున విలపించారు. దంపతుల మృతితో ముగ్గురు కూతుళ్లు అనాథలుగా మారారు. ఊట్‌పల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసిన బోధన్ రూరల్ ఎస్సై రాజశేఖర్ దర్యాప్తు చేపట్టారు.

## జాతీయ రహదారిపై రెండు కార్లు ఢీ.. పలువురికి గాయాలు..

**అక్షరటుడే, కామారెడ్డి:** వేగంగా వస్తున్న ఓ కారు అదుపుతప్పి డివైడర్ పైనుంచి దూసుకెళ్లి అవతలి వైపు నుంచి వస్తున్న కారును బలంగా ఢీకొంది. ఈ ఘటనసదాశివనగర్ మండలం మల్లుపేట జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ నుంచి కామారెడ్డి వైపు వస్తున్న మహారాష్ట్రకు చెందిన మహీంద్రా కారు మల్లుపేట శివారులోకి రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. డివైడర్‌పై నుంచి దూసుకెళ్లిన కారు కామారెడ్డి నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న హ్యుందాయ్ కారును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు కార్లు ధ్వంసం కాగా మహీంద్ర కారులో ఉన్న భార్యాభర్తలకు తీవ్ర గాయాలు కాగా, హ్యుందాయ్ కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. రెండు కార్లు ఢీకొనడంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కార్లను పక్కకు తప్పించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ప్రమాదంలో గాయపడిన వారిని కామారెడ్డి జీజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రుల వివరాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.






## బాధిత కుటుంబానికి ఎస్‌బీఐ బీమా చెల్లింపు

**అక్షరటుడే, ఇందూరు:** ఆర్మూర్ పరిధిలోని రాజారాం నగర్ ఎస్‌బీఐ బ్రాంచ్ ఖాతాదారుడు షేక్ అస్గర్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. అతడు బ్యాంక్‌లో రూ.1,000 చెల్లించి ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ పాలసీని తీసుకున్నారు. దీంతో బాధితు కుటుంబానికి రాజారాం నగర్ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ శైలేంద్ర, జనరల్ ఇన్సూరెన్స్ ఏరియా మేనేజర్ కాశీనాథ్ శ్యామ్ రూ.20లక్షల చెక్‌ను సోమవారం అందజేశారు. బీడీఎం చేపూరు శ్రీధర్ క్లెయిమ్ ప్రక్రియను వేగవంతం చేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ అధికారులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి ప్రజావాణిలో ఏడు ఫిర్యాదులు స్వీకరణ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి మొత్తం ఏడు ఫిర్యాదులు స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించినవి నాలుగు ఉండగా.. ఒక భూమి సర్వే దరఖాస్తు, మున్సిపాలిటీకి సంబంధించినవి రెండు ఉన్నాయి. వీటిని త్వరలోనే పరిష్కరిస్తామని అధికారులు పేర్కొన్నారు.